నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, బుధవారం 7 మే 2025 SIDDIPET

# దెబ్బ తిన్న పంటల వివరాలు సేకరిస్తాం



సిద్దిపేట జిల్లా కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లిలో గాలివానకు రాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), మే 6 : సిద్దిపేట జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో అకాల వర్షం, గాలివాన వల్ల దెబ్బతిన్న వరిపంటతోపాటు విశ్వ నాథ్‌పల్లి, రవీంద్రనగర్‌లో దెబ్బతిన్న మామిడి తోటలను రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎంత మేరకు వరిపంట, మామిడి తోటలకు నష్టం జరిగిందో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను గుర్తించి వివరాలు సేకరిస్తారన్నారు. అధికారులు సేకరించిన వివరాలను ప్రభుత్వానికి పంపించి త్వరగా నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, కొండపాక తహసీల్దార్ దిలీప్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్, ఏవో, ఏఈవోలు పాల్గొన్నారు.

# 'కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే గుణపాఠం చెబుతారు'



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, మే 6 : కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. అకాల వాన వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉదయశ్రీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. అధికారులు నామమాత్రంగా పంటలను పరిశీలించి నివేదికలు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భైరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు లింగం, గొల్ల రాములు, నర్సింహారెడ్డి, కిష్టయ్య, మల్లేశం, దుర్గారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# కొనుగోళ్లు వేగవంతం చేయాలి




సిద్దిపేట మార్కెట్ యార్డును సందర్శించిన అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట, మే 6: సిద్దిపేట మార్కెట్ యార్డును మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాంటాలైన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు పాల సాయిరామ్ ఆధ్వర్యంలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. మిల్లులకు తరలించడానికి 3500 బస్తాల ధాన్యం సిద్ధంగా ఉన్నా లారీలు లేకపోవడం వల్ల నీటిపాలైందని వివరించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన కోరారు.

# ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ ముఖ్యం

### సిద్దిపేట సీపీ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట, మే 6: పోలీస్ యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ చాలా ముఖ్యమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. మంగళవారం సిద్దిపేట సీపీ కార్యాలయంలో హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోంగార్డు నుంచి పోలీస్ ఉన్నతాధికారుల వరకు అందరూ పోలీస్ కుటుంబమన్నారు. యూనిఫామ్‌లో ఉన్న వారిని ప్రజలు నిత్యం గమనిస్తారని, అది తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. చిన్న చిన్న పొరపాట్లతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం రన్నింగ్, వాకింగ్, స్విమ్మింగ్, యోగా, మెడిటేషన్‌లో ఏదో ఒకటి తప్పకుండా నిత్యం ఆచరించాలన్నారు.మద్యం, మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి శనివారం పరేడ్ నిర్వహించినప్పుడు సమస్యలను సంబంధిత అధికారులకు తెలుపాలని సూచించారు. పోలీస్‌శాఖలో పనిచేస్తున్నప్పుడు సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దని తెలిపారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్ర బోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, కార్తీక్ ,విష్ణుప్రసాద్, ఆర్‌ఎస్సైలు బాలకృష్ణ ,రంజిత్, సాయి చరణ్, హోంగార్డు అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మాకు ఉచితాలు ఇవ్వమనలేదు



- మేం దాచుకున్న కష్టార్జితం ఇవ్వమంటున్నాం
- ఆర్టీసీ రిటైర్డు కండక్టర్ బుర్ర వెంకన్న ఆవేదన

హుస్నాబాద్‌టౌన్, మే 6: ''నేను తీసుకున్న రు ణం తీర్చమనలేదు.... నాకు ఉచితంగా ఇల్లు కట్టించమనలేదు... నాకు ఉచిత కరెంట్ బిల్లుకట్టమని చెప్పలేదు. నాకు ఉచితంగా పింఛన్ కావాలని కోరలేదు.. తక్కువ రేటుకు గ్యాస్ సిలిండర్ కావాలని అడగలేదు... నాకొడుకు సైకిల్‌పై వెళ్లి ఇంజినీరింగ్ కాలేజీలో ఫీజు కడితే... నాతో కారులో వచ్చిన వ్యక్తి ఫీజు కూడా కట్టలేదు.. కారణం తెల్లరేషన్‌కార్డు నాకు లేదు కాబట్టి.. నా భూమి పండించడానికి ఎకరానికి పదిహేనువేల రూపాయలు కావాలని అడిగా... నేను ట్యాక్స్‌లు సైతం కట్టా. నేను కష్టపడి దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు ఇవ్వకపోతే ఎలా'' అంటూ హుస్నాబాద్ ఆర్టీసీ బస్‌డిపోలో కండక్టర్‌గా పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన బూర వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాట్యూటీలేదు. ఫిట్‌మెంట్ ఇవ్వలేదు... నిజంగా ఎంతమంది ఉచితాలకు అర్హులు... ఎంతఅయినా ఇచ్చుకోండి.. మేము వద్దు అనలేదు. కానీ దయచేసి మావి మాకు ఇవ్వండి. మేము ఓట్లువేశాం. మమ్ములను మనుషులుగా గుర్తించండి.. రాత్రి, పగలు డ్యూటీలు చేసినం. సగం రాత్రులు రాత్రి డ్యూటీలోనే కిలిసిపోయాయి. ఎంతకష్టపడి ప్రభుత్వానికి, ప్రజలకు సేవచేసినం. జీవితాంతం కష్టపడి దాచుకున్న డబ్బులు ఇవ్వకపోతే ఎలా... పనికిరాని ప్రభుత్వం బానిసలుగా భావించకండి.. మా మీద కూడా దయచూపించండి... రిటైర్డు కాబోయే ఉద్యోగులరా మీరు ఆలోచించండి అంటూ బుర్ర వెంకన్న సోషల్ మీడియాలో పెట్టిన కథనం వైరల్‌గా మారింది.



సిద్దిపేట జిల్లా రంగధాంపల్లిలో వర్షానికి నేలకొరిగిన వరిపంట



సిద్దిపేట మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

- రెండు,మూడు రోజులుగా ఈదురుగాలులు,వర్ష బీభత్సం
- వేలాది ఎకరాల్లో వరి, మామిడి పంటలకు నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- మార్కెట్ యార్డుల్లో వర్షం నీటిలో కొట్టుకుపోయిన వడ్లు
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు
- అన్నదాతలను ఓదార్చని మంత్రులు.. భరోసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

# అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం



సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న మహిళా రైతు

సిద్దిపేట, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలో మూడు రోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలకు వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడి తోటల్లో కాయలు నేలరాలడంతో పాటు చెట్లు విరిగాయి. కొనగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం రాశులు తడిసి వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆరుగాలం కష్టించి పండించిన రైతుకు కునుకు లేకుండా పోయింది. చేతికి వచ్చిన పంట అకాల వర్షంతో చేజారడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈదురుగాలులకు రైతులు ఆగమాగమవుతున్నారు. ఆరు నెలల కష్టం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. కొన్ని గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయి. మామిడి తోటల్లో కాయలు నేల రాలి చెట్లు నేల కొరిగాయి.. బలమైన ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. గంటల తరబడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలో మూడు రోజులుగా రాత్రి బలమైన గాలులు వీయడంతో పాటు వర్షం కురవడంతో భారీ నష్టం జరిగింది. సిద్దిపేట,దుబ్బాక, గజ్వేల్, జనగామ, హుస్నాబాద్, నియోజకవర్గాల్లో వరి, మామిడి పంటలకు భారీ నష్టం జరిగింది.ఇంత జరిగినా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన మంత్రులు కనీసం పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కనీసం తాము ఉన్నామని భరోసా కూడా జిల్లా మంత్రులు ఇవ్వడం లేదు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### 15 వేల ఎకరాల్లో పంటలకు నష్టం

సిద్దిపేట జిల్లాలో మూడు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు,అకాల వర్షాలకు దాదాపు 15 వేల ఎకరాలకు పైగా పంటలకు నష్టం జరిగినట్లు సమాచారం. సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో 10 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఆనష్టం మరింత పెరిగింది. దాదాపు జిల్లాలో 15 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగింది. మామిడి తోటల్లో కాయలు పూర్తిగా నేల రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి కాయలు రాలడంతో పాటు చెట్లు నెలకొరిగాయి. ప్రధానంగా సిద్దిపేట అర్బన్, రూరల్, చిన్నకోడూరు, నంగునూరు, దుబ్బాక, రాయపోల్, దౌల్తాబాద్, తొగుట, కొండపాక, కుకునూరుపల్లి, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, హుస్నాబాద్,అక్కన్నపేట, కోహెడ మండలాల్లో ఈదురుగాలులు వీచాయి. పిడుగులకు పశువులు చనిపోయాయి. బలమైన గాలులతో రేకులు, కోళ్లఫారాలు లేచి పోయాయి.

### రైతులకు భరోసా ఇవ్వని ప్రభుత్వం

జిల్లాలో రెండు మూడు రోజులుగా బలమైన ఈదురుగాలులు వీచి పంటలకు నష్టం జరిగినా జిల్లాకు చెందిన మంత్రులు కనీసం రైతుల వైపు చూడడం లేదు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం రైతులను ఓదార్చడం లేదు. రైతుల గురించి పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం సుడిగాలి పర్యటనలు చేసి రైతులకు ధైర్యం చెప్పారు. తాము ఉన్నామని భరోసా కల్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. రైతు భరోసా లేదు, పంట రుణమాఫీ పూర్తిగా చేయలేదు. ఇవ్వాళ అకాల వర్షాలతో పంటలు నష్టపోతే కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.




సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు



హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నిలిచిన వర్షంనీరు



సిద్దిపేట జిల్లా కూటిగల్‌లో తడిసిన ధాన్యం వద్ద రైతులు



హుస్నాబాద్‌టౌన్: ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు

# పరిహారం కోసం ఎదురుచూపులు!

- అకాల వర్షాలకు మెదక్ జిల్లాలో 680 ఎకరాల్లో పంట నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



మెదక్ జిల్లా నార్సాపూర్ మండల సీతారాంపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

మెదక్, మే 6 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్, మేలో అకాల వర్షాల కారణంగా సుమారు జిల్లాలో 680.20 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. భారీ వర్షాల వల్ల చేతికొచ్చిన పంట నేల రాలి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. రైతులు వరి పంట కోసిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించారు. ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండడంతో రైతుల కష్టాలు చెప్పనలవికావు. ధాన్యంపైన కప్పడానికి టార్పాలిన్లు లేక రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం కావడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**సర్వే అంతంతమాత్రమే**

ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వ్యవసాయశాఖ, రెవెన్యూ సంయుక్తంగా సర్వేలు చేపట్టాయి. రైతులు సాగు చేసిన పంటల వివరాలు సేకరించింది. కేవలం ఎకరం వరి పొలంలో 33 శాతం నష్టం వాటిల్లితే నష్టపరిహారం పథకం వర్తించదని ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఎకరానికి 33 శాతం పంట నష్టపోయిన రైతులకు రూ.10వేల వరకు పరిహారం రావచ్చనే అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే సర్వేలు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. ఇంకా సర్వే చేయని మండలాల్లో సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు భరోసా కింద మూడు ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందింది. మిగతా రైతులకు రైతు భరోసా అందక పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానకాలం పంటలు సాగు చేసే వరకైనా పంట నష్టపరిహారం పెట్టుబడి కోసం వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు. అకాల వర్షాల వల్ల మెదక్ జిల్లాలో 540 మంది రైతులకు చెందిన 680 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరానికి రూ.20 వేల పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### సర్వే పూర్తి చేసి నివేదిక అందజేస్తాం

మెదక్ జిల్లాలో అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతుల పొలాల వద్దకు వెళ్లి సర్వే చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 540 మంది రైతులకు చెందిన 680.20 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇంకా సర్వే చివరి దశలో ఉంది. కొన్ని మండలాల్లో సర్వేచేయాల్సి ఉంది. సర్వే పూర్తి చేసిన వెంటనే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. రైతులకు సాయం చేయడానికి కృషి చేస్తాం.

–వినయ్‌కుమార్, డీఏవో, మెదక్ జిల్లా



మెదక్ జిల్లా చేగుంట మండలం బీకొండాపూర్‌లో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

# చిన్నారులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో చిన్నారుల హాజరును పరిశీలిస్తున్న న్యాయమూర్తి సౌజన్య

సంగారెడ్డి, మే 6: చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి సౌజన్య అధికారులకు సూచించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. న్యాయ సంబంధమైన సమస్యలు తలెత్తితే సులువుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. చిన్నారుల బాగోగులను అధికారులు పర్యవేక్షించి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులకు న్యాయ సహాయం ఏదైనా అవసరమైతే న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ అధికారులు, సిబ్బది పాల్గొన్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

జిన్నారం, మే 6: సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికవాడలోని మైలాన్ పరిశ్రమ ఆర్‌అండ్‌డీ సెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అగ్ని ప్రమాదాన్ని గుర్తించి యాజమాన్యానికి సమాచారం అందించారు. నాలుగో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. తెల్లవారుజామున సంఘటన జరగడంతో ఆసమయంలో కార్మికులు, సిబ్బంది లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఘటనా స్థలాన్ని సీఐ రవీందర్ రెడ్డి సందర్శించారు. అగ్నిప్రమాదంలో ల్యాబ్‌లోని పలు పరికరాలు కాలి బూడిదయ్యాయి. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో బొల్లారం పారిశ్రామికవాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.



పరిశ్రమ నాలుగో అంతస్తులో ఎగిసి పడుతున్న మంటలు